క్లుప్తంగా

పాలుట్ల రంగస్వామికి వెండి పళ్లెం కానుక



వెండి పళ్లెం, గంటను అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె కొండపై వెలసిన పాలుట్ల రంగస్వామికి డోన్ మండలం తాడూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి, సువర్ణ దంపతులు రూ. 50 వేలు విలువ చేసే 56 తులాల వెండి పళ్లెం హారతి, గంటను ఆలయ అర్చకుడు విష్ణువర్దన్ ఆచార్యులకు అందజేశారు. దాతలకు శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగస్వామిస్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నైట్ డ్యూటీలు ఎత్తివేయాలని మంత్రికి వినతి



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

బనగానపల్లెరూరల్: నైట్ డ్యూటీలను ఎత్తివేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (వీఆర్‌ఏ) జిల్లా అధ్యక్షుడు నాగేష్ వీఆర్‌ఏలతో కలిసి రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న విధంగా పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్‌ఓలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు బాలన్న, హరి, శేష్‌కుమార్, బాలనాయుడు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

కొలిమిగుండ్ల: బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన ఇటిక్యాల–కొలిమిగుండ్ల ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఇటిక్యాలకు చెందిన నరసింహయ్య బాలరాజుతో కలిసి బైక్‌పై కొలిమిగుండ్లకు వెళ్లి పని ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరారు. మార్గమధ్యలో కనకాద్రిపల్లె వైపు నుంచి వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు రోడ్డుపై పడటంతో గాయపడ్డారు. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి స్పృహతప్పి పడిపోయిన ఇద్దరిని లేపి మంచినీళ్లు తాపించారు. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు క్రీడలూ ముఖ్యమే



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ బీవీ ప్రసాదరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం జీవీ సుబ్బారెడ్డి సూచించారు. పట్టణంలో సోమ లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని శనివారం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఖోఖోలో చిదానంద, సెయింట్ జోసఫ్స్ పాఠశాలల విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. కబడ్డీ పోటీల్లో బాలికోన్నత పాఠశాల, వికాస్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సువర్ణ, హర్ష, ఓబులేసు, సుధీర్, అక్బర్, చౌడయ్య, రవి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవల పరిశీలన



రోగులతో మాట్లాడుతున్న రూపేంద్రనాథ్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవలను ఎన్టీఆర్ సేవా పథకం జిల్లా కో ఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద సుమారు 3 వేలకుపైగా జబ్బులకు ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద బనగానపల్లె వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, గైనిక్ తదితర వాటికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో ఈ పథకం కింద వైద్యం పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య మిత్రలు ఆజీజ్, సుబ్రమణ్యం ఉన్నారు.

మహిళా సిబ్బంది రక్షణపై దృష్టి పెట్టాలి



మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బంది రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాత్రి సమయాల్లో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తే కొంత ధైర్యంగా ఉంటుంది. మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా వాష్‌రూమ్‌లు ఉండాలి. ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. వైద్య సిబ్బందిపై దాడి చేస్తే కఠిన శిక్షలు పడేలా చట్టాల్లో మార్పులు చేస్తే బాగుంటుంది. నేను విధులు నిర్వహించే బేతంచెర్ల ఆస్పత్రిలో రెస్ట్ రూమ్, వాష్ రూమ్ సరిగా లేదు.

–ఉషా బాయి, స్టాఫ్ నర్సు, బేతంచెర్ల

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లు, సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో కొందరు మద్యం మత్తులో వస్తున్నారు. వైద్యం కోసం వచ్చే వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించిన తర్వాతే వైద్యశాలలోకి అనుమతించాలి. రాత్రి వేళల్లో ఒంటరిగా మహిళా డాక్టర్లకు డ్యూటీలు కేటాయించవద్దు. కనీసం వారికి ఇద్దరు తోడు ఉండాలి. ఆస్పత్రుల వద్ద పోలీసులు పర్యవేక్షణ ఉండాలి.

–హరిచరణ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్, కొలిమిగుండ్ల



వసతులు కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. ముఖ్యంగా వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో మహిళా వైద్యులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే సిబ్బందికి రక్షణ కూడా కరువైంది. ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసి వైద్యులు, సిబ్బందికి అన్ని రకాల వసతులు, రక్షణ కల్పించేలా చట్టం చేయాలి.

–కె.చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్, కొత్తబురుజు పీహెచ్‌సీ

జాతీయ రహదారిగా మారేనా..?

- కొలిమిగుండ్ల–జమ్మలమడుగు రోడ్డుకు మోక్షమెప్పుడో
- ఏడాదిన్నర క్రితమే ప్రకటించిన కేంద్రం
- దృష్టి సారించని కూటమి ప్రభుత్వం





కొలిమిగుండ్ల–జమ్మలమడుగు ప్రధాన రహదారి, ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల జంక్షన్ నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని ఏడాదిన్నర క్రితమే కేంద్ర ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు నేషనల్ హైవే జాబితాలో చేర్చింది. కొలిమిగుండ్ల నుంచి జమ్మలమడుగు వరకు సుమారు 50 కి.మీ ఉంటుంది. గతంలో సర్వే సైతం చేపట్టారు. జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు, కడప, నెల్లూరు తదితర ప్రాంతాలకు ఇప్పటికే నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటైంది. కొలిమిగుండ్ల జంక్షన్ నుంచి జమ్మలమడుగు వరకు మాత్రమే డబుల్ రోడ్డు ఉండడంతో ఈరోడ్డును అభివృద్ధి చేస్తే రవాణ మెరుగుపడుతుందని కేంద్ర ప్రభుత్వం భావించింది. ప్రస్తుతం ఉన్న డబుల్ రోడ్డుపై ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈరోడ్డు మీదుగా జమ్మలమడుగు వరకు రెండు సిమెంట్ ప్యాక్టరీలు ఏర్పాటు కావడంతో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. కల్వటాల, కొలిమిగుండ్ల సమీపంలో బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారి తరచూ వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు లెవల్‌లోనే బ్రిడ్జిలు ఉండడం, సైడ్ వాల్స్ లేకపోవడంతో ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రెండు వాహనాలు ప్రయాణించలేని పరిస్థితి ఉంది. రాత్రి వేళల్లో మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ జరుగుతుందనే ఉద్దేశంతో బ్రిడ్జిలు వెడల్పుకు నోచుకోవడం లేదు. ఎన్‌డీఏ కూటమి అధికారంలో ఉండడంతో నిధులు మంజూరు చేసి త్వరగా జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అందరి భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి



ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌ల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎంఈఓలు

సంజామల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు కృషి చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు రాజయ్య, ఈశ్వరయ్యతో కలిసి మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంఈఓలు మాట్లాడుతూ.. అందరి భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి పిల్లోడు పాఠశాలకు వచ్చేలా హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు చొరవ చూపాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు వారానికి ఒక్కసారైన పాఠశాలను సందర్శించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్‌ల ప్రారంభోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

- డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి



మొక్కలు నాటుతున్న విద్యార్థులతో జడ్జి తంగమణి

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమని అన్నారు. స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. పర్యావరణం రోమార్పులు చెందుతోందని.. కాలుష్యం పెరిగిపోతోందని తెలిపారు. భావితరాల భవిష్యత్ కోసం అందరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన చిత్తూరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎన్నారై డాక్టరు మాధవికి స్ఫూర్తి సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతా, ఉపాధ్యాయులు, స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు, సభ్యులు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశ్‌బాబు

బేతంచెర్ల: విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీఓ వెంగన్న అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ సోమశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, వెల్ఫేర్ ఎడ్యుకేషల్ అసిస్టెంట్లు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లకు పాఠశాలల్లోని టాయిలెట్ల పర్యవేక్షణపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో హెచ్‌ఎంలు పాఠశాలలోని టాయిలెట్లను పర్యవేక్షించేవారని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం, గురువారం టాయిలెట్లను ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, బుధవారం, శుక్రవారం ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు పర్యవేక్షిస్తారన్నారు. అందరూ సమష్టితో పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: స్థానిక ధరణి టౌన్‌షిప్పులోని జెడ్పీ హైస్కూల్ కేంద్రంగా ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. 14 ఏళ్లు నిండి 10వ తరగతి ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోగా పాఠశాల హెచ్‌ఎంకు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని గోపాల కృష్ణ బృందావనంలో సోమ, మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం కృష్ణునికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు, సాయంత్రం గ్రామోత్సవం, మంగళవారం ఉదయం 10 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం, 12 ఏళ్లలోపు పిల్లలకు శ్రీకృష్ణ, రాధ వేషధారణ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చాటిన వారికి రూ.1516, రూ.1016, రూ.516 నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం



విద్యార్థులతో మాట్లడుతున్న ఓబులేసు

సంజామల: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని డోన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ఓబులేసు అన్నారు. సంజామల బీసీ హస్టల్‌ను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధతో విని సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎంత బాగా చదివినా క్రమశిక్షణ లేకుంటే జీవితంలో విజయం సాధించలేరని పేర్కొన్నారు. విద్యార్థులు సొంతంగా ఆలోచన చేసే శక్తి రావాలని అన్నారు. హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే వార్డెన్ దృష్టికి తీసుకొనిరావాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీది విద్యార్థులకు అందాలని బీసీ హస్టల్ సంక్షేమ అధికారి మునిరాజుకు సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: డోన్ సబ్ స్టేషన్‌లో 132 కేవీ టవర్స్ మరమ్మతు పనుల కారణంగా ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండవచ్చని డీఈఈ నాగేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితులకు రాచర్ల 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేలా చూస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వేరుశనగలో తెగుళ్ల నివారణపై అవగాహన



వేరశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల, యు.కొత్తపల్లి, దేవరబండ గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ, కంది, సజ్జ పంటలను ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఏఈఓ అబ్దుల్‌షఫి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. వేరుశనగ పంటలో తిక్కాకు మచ్చ తెగులు నివారణకు జిప్సం వంటి మందులు వాడాలని సూచించారు. అలాగే కంది పంటలో వేప నూనె ఉపయోగాల గురించి వివరించారు. పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. వారి వెంట వ్యవసాయ సహాయకులు నరసింహ, మున్ని, జీవిత ఉన్నారు.

సారా విక్రేతల అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలో సారా విక్రయిస్తున్న హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన రామకృష్ణ, దుర్గాపేటకు చెందిన తాళ్లూరి బాల సుంకన్నను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పి.అశోక్ శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టుకు పంపినట్లు వెల్లడించారు.

ఆంజనేయస్వామికి పూజలు



ఆంజనేయ స్వామికి ఏర్పాటు చేసిన పంచలోహ ప్రతిమ

ప్యాపిలి: మండల పరిధిలోని చిన్నపొదిళ్ల గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి పంచలోహ ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు. అంతకు ముందు నూతన పంచలోహ ప్రతిమకు గ్రామ పురవీధుల మీదుగా పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు పండుగలా జరుపుకుంటారు. ఆలయ ప్రాంగణంలో పుల్లాసి శివ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిసరాల్లో యాచకవృత్తి ద్వారా జీవిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందడంతో ద్రోణాచలం సేవా సమితి ఆత్మబంధు సభ్యులు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు గుర్తించి ద్రోణాచలం సేవా సమితి సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు స్పందించిన సభ్యులు షాదిఖానా రాజు, గురుస్వామి, తాహెర్‌బాషా, మురళితో పాటు పట్టణ పోలీసులు వెంకటేష్‌నాయక్, యుగంధర్‌రెడ్డిలు అనాథ శవాన్ని హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు చరణ్‌తేజ్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఘనంగా రంగస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని రంగస్వామికొండపై వెలసిన రంగస్వామి గ్రామోత్సవాన్ని శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఏటా శ్రావణమాసం మఖ కార్తి చివరి శనివారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం పాలెగారి వెంకటప్పనాయుడు ఇంటి నుంచి గుర్రంపై ఖాళీ కలశాన్ని ఊరేగింపుగా కొండకు తీసుకెళ్లారు. దారి పొడవునా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి కొండపై రంగస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి నీటితో నింపిన కలశాన్ని తీసుకుని వచ్చారు. ఇలా చేయడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని గ్రామపెద్దల నమ్మకం.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

డోన్ టౌన్: విశ్వహిందూ పరిషత్ 60 వసంతాల వేడుకలను పురస్కరించుకుని చిన్నారులకు భగవద్గీత పఠనంపై శనివారం పోటీలు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రైమరీ, సెకండరీ స్కూల్ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతమాత చిత్ర పటానికి, శ్రీకృష్ణ చిత్ర పటాలకు విశ్వ హిందూ పరిషత్ డోన్ ప్రఖండ రామా రాజేష్, పూల మాలలు వేసి పూజలు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి భగవద్గీత పఠనం చేశారు. ఈ పోటీల్లో 40 శ్లోకాలను పఠించిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ 60వ వసంతోత్సవం కరపత్రాలను విడుదల చేశారు.

యాగంటిలో ఎస్ఈసీ జాయింట్ సెక్రటరీ



జీవి సాయిప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: యాగంటిలోని ఉమామహేశ్వరస్వామిని రాష్ట ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం, పూజలు చేయించారు. అనంతరం వేదాశీర్వాదం అందించి తీర్థప్రసాదాలతో సత్కరించారు.



కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ప్యాపిలి: స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషంలో ఆకట్టుకున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణాష్టమి ప్రాముఖ్యతను హెచ్‌ఎం పార్థసారథి విద్యార్థులకు వివరించారు.

ఆగిన పనులు.. అందుబాటులోకి రాని సేవలు

- కొలిమిగుండ్లలో ఆగిన బ్లాక్ హెల్త్ యూనిట్ భవన పనులు
- పూర్తయితే రోగులకు మెరుగైన వైద్య సేవలు, పరీక్షలు



ఆగిపోయిన భవన నిర్మాణ పనులు



గడ్డకట్టుకున్న సిమెంట్ బస్తాలు

కొలిమిగుండ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న బ్లాక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఏడు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌లు మంజూరు కాగా అందులో కొలిమిగుండ్లకు కేటాయించారు. ఒక్కో వాటి నిర్మాణానికి కేంద్రం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ సాధారణ ఎన్నికల కంటే ముందుగా పనులు మొదలు పెట్టి వేగవంతం చేశారు. ప్రస్తుతం పనులు ఆగిపోవడంతో భవనం అసంపూర్తిగా ఉంది. పనుల కోసం నిల్వ ఉంచిన సిమెంట్ బస్తాలు గడ్డకట్టుకుపోయాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో అప్పటి ప్రభుత్వం కేంద్రం సహకారంతో బ్లాక్ హెల్త్ యూనిట్‌ల మంజూరుకు కృషి చేసింది. ఇందులో 54 రకాలకు పైగానే పరీక్షలు చేస్తారు. పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య, ల్యాబ్ సౌకర్యం లేని ప్రాంతాలతో పాటు పట్టణాలకు దూరంగా ఉన్న పీహెచ్‌సీల్లో ఈ యూనిట్లు నిర్మిస్తున్నారు. భవనాల పనులు మొదలు కాగానే పీహెచ్‌సీలకు అల్ట్రాసోనో, సెఫీ మిషన్‌లు, డయాగ్నసిస్, రేడియాలజీ, లివర్, కిడ్నీతో పాటు 54 రకాల పరీక్షలు చేసేందుకు అవసరమైన మిషనరీలు పంపారు. కొలిమిగుండ్ల మండలం మూడు జిల్లాలకు సరిహద్దులో ఉండడంతో పాటు నాపరాతి గనులు ఇక్కడ అధికంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు ఏచిన్న ల్యాబ్ టెస్ట్ కోసం సమీపంలోని తాడిపత్రి, జమ్మలమడుగు, నంద్యాల తదితర పట్టణాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో గత ప్రభుత్వం రూ.50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ఏర్పాటు చేయించింది. సకాలంలో పూర్తి కావాల్సిన భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. సవ్యంగా జరిగి ఉంటే ఈపాటికి పనులు పూర్తి అయి ప్రారంభోత్సం కావాల్సి ఉండేది. అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అధికారులు చొరవ తీసుకుని నిర్మాణ పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు జియారత్ వేడుకలు

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామంలోని పీర్ల చావిళ్లలో ఆదివారం జియారత్ వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మొహర్రం పండుగ ముగిసి 40 రోజులు కావడంతో బాదుల్లాస్వామి, బార్ఇమాంపీర్ల జార్తలు ఏర్పాటు చేశామన్నారు. జియారత్ వేడుకలు పురస్కరించుకుని చావిళ్ల వద్ద అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.